క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

జగిత్యాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ స్పందన అన్నారు. సోమవారం 100 రోజుల ప్రణాళిక లో భాగంగా పలు కాలనీల్లో చెట్లు, మొక్కలు తొలగించి డ్రెయినేజీలను శుభ్రపర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షకాలంలో పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



పాత టైర్లలో నీళ్లు పారబోస్తున్న సిబ్బంది

కోరుట్ల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ ప్రజలు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అందె మారుతీ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని 17,18,26 వ వార్డుల్లో ప్రలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు మురికి కాల్వల్లో స్ప్రే చేశారు. వార్డుల్లో ఖాళీ కుండలు, పాత టైర్లు, కుండీల్లో నిల్వ ఉన్న నీళ్లను తొలగించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, అశోక్, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసాతో ఆత్మస్థైర్యం



చాలీసా ప్రతులను ఆవిష్కరిస్తున్న ఛత్రపతి

మెట్‌పల్లి: హనుమాన్ చాలీసా పారాయణం వల్ల ఎన్నో విధాలుగా ప్రయోజనం కలుగుతోందని గీతా సత్సంగం అధ్యక్షుడు చీలమంతుల ఛత్రపతి అన్నారు. డాక్టర్ చిట్నేని రఘు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో 82 జ్ఞాన యజ్ఞంలో భాగంగా హన్మాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ రఘు మాట్లాడుతూ 14 రోజుల పాటు జరిగే ఈ పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మర్రి భాస్కర్, మహాజన్ హరీశ్, గాదె రమేష్, పడిగెల వెంకటేశ్, ఏలేటి నరేందర్‌రెడ్డి, వడ్డెపల్లి శివ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రఘువరన్

ఇబ్రహీంపట్నం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సిబ్బంది సిబ్బంది ఉండాలని డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి రఘువరన్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందునా సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు వేగవంతంగా నిర్మాణం పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో కొమురయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో కోళ్ల ఫారం, పశువుల పాకల నిర్మాణం

పెగడపల్లి: ఉపాధిహామీలో కోళ్ల ఫారం, పశువుల పాకల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లాపూర్‌లో సోమవారం కోళ్ల ఫారం, పశువుల పాకల నిర్మాణ పనులకు ఎంపీడీవో ముగ్గులు పోశారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు రావాలని కోరారు. ఎంపీవో మహేందర్, టీఏ రాజేశం, ఎఫ్ఏ మల్లేశం, మాజీ ప్రజాప్రతినిధులు శ్రీనివాస్‌గౌడ్, రాజేశం, కారొబార్ సత్తయ్య పాల్గొన్నారు.






ప్రజలు సమస్యల్లో.. అధికారులు సెల్‌ఫోన్లలో..

జగిత్యాలటౌన్: 'ప్రజావాణి' అధికారులకు ఆటవిడుపుగా మారింది. కలెక్టర్ సత్యప్రసాద్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించే పనిలో నిమగ్నం కాగా.. అధికారులు మాత్రం సెల్‌ఫోన్లలో మునిగితేలడం కనిపించింది. ఓ జిల్లా స్థాయి అధికారి ఫోన్‌లో గేమ్స్ ఆడుతుంటే, మరో అధికారి రీల్స్ చూస్తూ కాలక్షేపం చేశారు. కలెక్టర్ వార్నింగ్ ఇస్తున్నా ఇలాంటి అధికారుల తీరు మాత్రం మారడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజావాణి లక్ష్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ఇలాంటి అధికారులపై కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్రికెట్ స్టేడియానికి స్థలం కేటాయింపు

- కొత్త కోర్టు పక్కన ఐదెకరాలు
- త్వరలో ఆదేశాలు జారీ
- జువ్వాడితో విప్ ఆది శ్రీనివాస్

కోరుట్ల: కోరుట్ల క్రికెట్ క్రీడాభిమానుల కోసం జాతీయ రహదారి వెంట.. కోర్టు పక్కన ఐదెకరాల స్థలం కేటాయిస్తున్నట్లు విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు. సదరు స్థలాన్ని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి సోమవారం పరిశీలించారు. స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు స్మారకార్థం నిర్వహించిన కేపీఎల్ టోర్నీలో నర్సింగరావుకు ఇచ్చిన మాట మేరకు శాప్ చైర్మన్, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి స్థలం కేటాయింపునకు ప్రతిపాదనలు పంపామని, త్వరలో ఉత్తర్వులు వస్తాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం స్థలం కేటాయింపునకు హామీ ఇచ్చినా ఉత్తదే అయ్యిందన్నారు. సిరిసిల్ల, కోరుట్ల, వేములవాడల్లో స్టేడియం ఏర్పాటుకు సన్నాహాలు చేశామన్నారు. ఈ మూడు స్టేడియాలతో ఈ ప్రాంతంలో క్రీడాహబ్ ఏర్పాటు అవుతుందన్నారు. స్టేడియం నిర్మాణానికి మరో రూ.3 కోట్లు మంజూరు చేస్తామన్నారు. ఈ నిధులతో క్రీడాకారులకు అవసరమైన గదులు, పరికరాలు, ఇతరత్రా సామగ్రి ఏర్పాటు చేస్తామన్నారు. నర్సింగరావు మాట్లాడుతూ.. క్రీడాకారులను తీర్చిదిద్దడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నంటి ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నం అనిల్, తిరమల గంగాధర్, ఎంబేరి నాగభూషనం, నయీం, కోరుట్ల క్రికెట్ అసోషియేషన్ గౌరవాధ్యక్షులు ఎం.చంద్రశేఖర్, అధ్యక్షులు మొయిజ్ పాల్గొన్నారు. అనంతరం కోరుట్ల వ్యవసాయ మార్కెట్‌లో విప్, నర్సింగరావు రూ.13,60,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 34మందికి పంపిణీ చేశారు.



కేసీఏ సభ్యులతో విప్ ఆది శ్రీనివాస్, జువ్వాడి

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి



ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పిస్తున్న దేవరాజ్

మల్లాపూర్: ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ దేవరాజ్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో సోమవారం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింతగా విస్తృతంగా అందించేందుకు ప్రయాణికుల నుంచి సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నామన్నారు. ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రాణాలను కొల్పోవద్దని, సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుంచి హైదరాబాద్ (వయా ఆర్మూర్) లగ్జరీ బస్సు ప్రారంభించామని, ఉదయం 5 గంటలకు ఖానాపూర్ నుంచి వచ్చే లగ్జరీ బస్సు సేవలను ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు దారి మళ్లింపు

కొడిమ్యాల: విద్యార్థులు, ప్రయాణికుల కోసం వేములవాడ నుండి జగిత్యాల కు వెళ్లే ఆర్టీసీ బస్సు రూట్ లో మార్పులు చేశారు. గతంలో వేములవాడ నుంచి కొడిమ్యాల బస్టాండ్ మీదుగా దొంగలమర్రి, జగిత్యాలకు వెళ్లేది. ఈ క్రమంలో అందరి సౌకర్యం కోసం కొడిమ్యాల మండలం నల్లగొండ, రామకృష్ణ పూరం, మోడల్ స్కూల్ స్టాప్, అంగడి బజార్ కు ఉదయం 9.30 వరకు చేరుకునే విధంగా రూట్ మార్చారు. తిరిగి మళ్లీ సాయంత్రం 4.30 తిరుగు ప్రయాణం చేసేలా ఏర్పాట్లు చేశారు.

రైతు నేస్తం ప్రారంభోత్సవం

మల్యాల: మల్యాల మండలంలోని రైతు వేదికలు, మల్యాల, మానాల, తాటిపల్లి రైతుల వేదికల్లో సోమవారం రైతు నేస్తం కార్యక్రమం కింద రాష్ట్రంలోని 1031 రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌లను అనుసంధానం చేసి, సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించే కార్యక్రమాన్ని రైతులు, అధికారులు ప్రత్యక్ష్యంగా వీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, స్పెషల్ ఆఫీసర్ మనోజ్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు మంజూరు

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు, మోహన్‌రావుపేట రైతువేదికలకు నూతనంగా వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయ అధికారి నాగమణి తెలిపారు. రైతు నేస్తం ప్రారంభోత్సవాన్ని రైతులు, అధికారులు పైడిమడుగు రైతు వేదికలో వీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, పీఏసీఎస్ చైర్మన్ జగన్మోహన్ రావు, ఏఎంసీ డైరెక్టర్ బాపురెడ్డి ఏఈవోలు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని మండల రైతులు, నాయకులు, అధికారులు తిలకించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ లత హాజరయ్యారు.

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం సాయంత్రం రైతు వేదికలలో నూతనంగా వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి రఘువరన్, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. కాన్ఫరెన్స్‌కు హాజరైన మహిళలు సీఎం సందేశం వినకుండానే వెళ్లిపోయారు.

మంత్రులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

జగిత్యాల: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన తుమ్మల నాగేశ్వర్‌రావును జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరై ఏళ్లు గడిచాయని, బకాయిలు మంజూరు చేసి త్వరగా పూర్తి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మరో మంత్రి వాకాటి శ్రీహరిని సైతం కలిసి అభినందనలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో ఊట్‌పెల్లి విద్యార్థినికి మొదటి ర్యాంకు

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లి గ్రామానికి చెందిన సుంకరి శృతి అనే విద్యార్థిని ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో ఫస్టియర్‌లో 468/470 మార్కులతో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్ సాధించారని గ్రామస్తులు సోమవారం తెలిపారు. శృతి కోరుట్ల పట్టణంలో మాస్టో జూనియర్ కళాశాలలో ఎంపీసీ కోర్సు చదువుతుంది. మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థిని శృతిని కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజేశ్, గ్రామస్తులు అభినందించారు.

వాహనాల తనిఖీ

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లిలో సోమవారం సాయంత్రం ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, వాహనాలకు ఉన్న పెండింగ్ చలాన్లు చెల్లించాలన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేములకుర్తిలో ఆలయ కమిటీ ఏర్పాటు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో సోమవారం 16 కుల సంఘాల సభ్యులు సమావేశం నిర్వహించి గ్రామ ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా నాంపెల్లి వెంకటాద్రి, వైస్ చైర్మన్‌గా బాస పెద్దోల్ల మల్లేశ్, కోశాధికారిగా నలిమెల రాజేందర్‌తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

ఉపకరణాల దరఖాస్తులకు హెల్ప్‌డెస్క్

జగిత్యాల: దివ్యాంగుల ఉపకరణాల దరఖాస్తుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు జిల్లా సంక్షేమాధికారి నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 289 ఉపకరణాల కోసం కేవలం 136 దరఖాస్తులు వచ్చాయని, అర్హత గల వారు ఈ నెల 18 లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కలెక్టరేట్‌లోని రూం నెం7 లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాయత్రి అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నిక

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని గాయత్రి అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, సహాయ ఎన్నికల అధికారిగా సిహెచ్. మనోజ్‌కుమార్ వ్యవహరించారు. అయితే, ఎన్నికల ఫలితాలను కేంద్ర సహకార ఎన్నికల సంఘం ధృవీకరించిన తర్వాత నూతన పాలకవర్గాన్ని ప్రకటిస్తామని జిల్లా సహకారాధికారి మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకుకు వచ్చిన కలెక్టర్ సత్యప్రసాద్‌ను బ్యాంకు అధికారులు, సిబ్బంది సన్మానించారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలి

జగిత్యాల: ఉద్యోగులందరూ అంకిత భావంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం టీఎన్జీవో నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ఉద్యోగస్తులు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, సాహెబ్ బాబు, రవీందర్, సుగుణాకర్, మధుకర్, ప్రమోద్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు

మల్లాపూర్: అర్హులైన నిరుపేదలకే పారదర్శకంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. మండలంలోని నడికుడలో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం భూమిపూజ చేసి ముగ్గు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు గూడు కల్పించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సిరిపురం రవీందర్, ముద్దం రాజేందర్‌రెడ్డి, దేవుడి గంగాధర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన సకల సౌకర్యాలు కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తుందని ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్‌లు అన్నారు. మండలంలోని కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులతో పాటు పాఠ్యపుస్తకాలను చైర్‌పర్సన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

పాఠశాలకు విద్యార్థుల విరాళాలు

మండలంలోని తుమ్మెనాల ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్ఎస్‌సి 2013–14 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు పాఠశాలలో అభివృద్ధి పనులకు 14,300 రూ.లు విరాళాలు అందజేశారు.

ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



కోరుట్ల: పట్టణంలోని వినాయక మండపం వద్ద ఆదివారం విద్యుత్ షాక్ గురై ఇద్దరు మృతి చెందగా మిగతా యువకులు హైదరాబాద్లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సోమవారం ఆస్పత్రిలో పరామర్శించారు.మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

మున్నూరు కాపులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మున్నూరు కాపులు

కోరుట్ల: రాష్ట్ర మంత్రివర్గంలో మున్నూరు కాపులకు స్థానం కల్పించాలని జగిత్యాల జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ కోరుట్ల పట్టణంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మన్సిపల్ మాజీ చైర్మన్ శీలం వేణు, వేంకటేశ్వర ఆలయ చైర్మన్ యతిరాజం నర్సయ్య, నాయకులు చెదలు గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామం నుంచి తక్కళ్లపెల్లి గ్రామానికి వెళ్లే రూట్‌లో తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి రోడ్డుపైకి రావడంతో వాహనాలపై వెళ్లేవారికి ప్రమాదకరంగా మారాయి. రాత్రివేళల్లో చెట్లు కనిపించకపోవడంతో బైక్‌లపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చొరవ చూపి రోడ్డుపైకి వచ్చిన పిచ్చిమొక్కలను తొలగించి చదును చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్,ఆర్‌అండ్‌బీ, ఏఈ కథలాపూర్, సెల్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అభివృద్ధి,సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రొసీడింగ్ పత్రాలు ఇస్తున్న నాయకులు

మెట్‌పల్లిరూరల్: అభివృద్ధి,సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు.ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం హామీలను ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల విషయంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

18న స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 18న స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశానికి సంబంధించిన సెలక్షన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి మేకల చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఎమ్మార్సీలో పీఈటీలతో సమావేశమయ్యారు. క్రీడల్లో నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి పోటీల్లో పాల్గొనేలా చూడాలన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారిని 26న జగిత్యాలలో జరిగే జిల్లా స్థాయి సెలక్షన్స్ పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో చక్రధర్, కొమురయ్య, జ్ఞానేశ్వర్, రాజేశ్, సంజయ్,శివ తదితరులున్నారు.

రాయికల్: బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 18న స్పోర్ట్స్ స్కూల్ కు సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాఘవులు సోమవారం తెలిపారు. వీటిలో పాల్గొనే విద్యార్థులు ఆన్‌లైన్ లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వివరాల కోసం పీడీ కృష్ణ ప్రసాద్ 94400 37 393 నంబర్‌లో సంప్రదించాలని కోరారు

మోడల్ స్కూల్‌లో గెస్ట్ పీజీటీ పోస్టుకు ..

మల్లాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గెస్ట్ పీజీటీ పోస్టు భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భూమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో పాఠశాల, కళాశాల విద్యార్థులకు రాజనీతి శాస్త్రం బోధించుటకు పీజీటీ విభాగంలో పొలిటికల్ సైన్స్ పోస్టుకు తాత్కాలిక ప్రతిపాదికన (హావర్లీ బేస్‌డ్) పనిచేయుటకు ఆసక్తి గల నిరుద్యోగులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీటీ పోస్టుకు ఎం.ఎ(పొలిటికల్ సైన్స్) తో పాటు బీ.ఈడీ విద్యార్హతలతో పాటు టెట్ అర్హత పొదిన అభ్యర్థులు మోడల్ స్కూల్‌లో గెస్ట్ పోస్టులకు ఈ నెల 18 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ప్రిన్సిపాల్ 9948752514 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో అతిథి అధ్యాపక ప్రాతిపదికన ఫిజికల్ డైరెక్టర్ పోస్టు భర్తీకి ఆసక్తి, అనుభవం కలిగిన అభ్యర్థులు ఈ నెల 18న కళాశాలలో నిర్వహించే డెమాన్‌స్ట్రేషన్‌కు హాజరుకావాలని ప్రిన్సిపాల్ మానస తెలిపారు. వివరాలకు 9866 559701 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఔదార్యం

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు ఆటోలు లేక పోవడంతో హెచ్‌ఎం కాశెట్టి శ్రీనివాస్, వేణుమాధవ్ తమ సొంత కారులో విద్యార్థులను తీసుకెళ్లి బడిలో తీసుకెళ్లారు. మండలంలోని తుమ్మెనాల ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు సోమవారం బడికి వెళ్లడానికి బయలు దేరారు. పాఠశాల దూరంగా ఉండడంతో ఆటోలలో వెళ్తుంటారు. కాని సమయానికి ఆటో లేక పోవడంతో విద్యార్థులు మరో బడికి ఎక్కడ వెళ్తారోనని తన సొంత కారులో విద్యార్థులను తీసుకెళ్లి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. హెచ్ఎంకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పారితోషికం

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు చెందోలి గ్రామానికి చెందిన రైటైర్డ్ జడ్జి అజిత్ సింహారావు సోమవారం నగదు పారితోషికం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనందరావు, చిక్యాల ముకుందరావు, మండల గీత కార్మిక సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

వెల్గటూర్ : పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక అన్నారు. సోమవారం ఎండపల్లి మండలం కొండాపూర్‌లో 26 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో నరేష్ కుమార్, హౌసింగ్ ఏఈ గౌతమి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు ఆస్పత్రిలో సేవలు అందించాలి

ధర్మపురి: మాతా శిశు ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందిని ఏర్పాటు చేసి వినియోగంలోకి తేవాలని సోమవారం బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ధర్మపురి పట్టణంలో రూ. 8.50 కోట్లతో మాతాశిశు ఆస్పత్రిని ఏర్పాటు చేసి రెండేళ్లు గడిచాయని, కోట్లాది రూ.లతో ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రిని వినియోగంలోనికి తెచ్చి ప్రజలకు వైద్య సేవలందించాలని పట్టణశాఖ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. ఓరుగంటి చంద్రశేఖర్, దివిటి శ్రీధర్, సూరజ్ తదితరులున్నారు.

జోరుగా బీరప్ప ఉత్సవాలు

పెగడపల్లి: మండల కేంద్రంలో గొల్ల–కురుమల ఆరాధ్య దైవం బీరప్ప దేవుని ఉత్సవాలు జోరుగా సాగుతున్నాయి. గొల్లల (యాదవ సంఘం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరప్ప బోనాలతో ఊరేగింపుతో ఆలయానికి చేరుకుని బీరప్పకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకునారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

అయిలాపూర్‌లో వ్యక్తి ఆత్మహత్య

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గొల్ల ఆశన్న (52) అనే వ్యక్తి ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు ఆశన్న కొంత కాలంగా భార్య మల్లవ్వతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో మల్లవ్వ కొన్ని రోజుల క్రితం తన తల్లిగారింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన ఆశన్న ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కింటి వారు గుర్తించి భార్య మల్లవ్వకు సమాచారం ఇచ్చారు. మల్లవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.